క్లుప్తంగా

రక్షాబంధన్ సందర్భంగా ప్రత్యేక బస్సులు

ఆర్మూర్ టౌన్ : రక్షాబంధన్ పండుగ సందర్భంగా ఆర్మూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి ఉదయగిరి, కనిగిరి పామూరు, వింజమూరుకు, సికింద్రాబాద్ వరకు స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

మున్నూరు కాపు సంఘానికి నిధులు మంజూరు



కమ్మర్‌పల్లి : ఏర్గట్ల మండలం తడపాకల్ మున్నూరుకాపు సంఘ భవన ప్రహరీ నిర్మాణానికి ఎంపీ అర్వింద్ తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.4.95 లక్షలు మంజూరు చేసినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చౌట్‌పల్లిలోని తన స్వగృహంలో నిధుల మంజూరు పత్రాలను కుల సంఘం సభ్యులకు అందజేశారు. ఏర్గట్ల బీజేపీ మండల అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి, గుమ్మిర్యాల్ ఎంపీటీసీ బొల్లి శంకర్, నాయకులు రమేష్, రంజిత్, అశోక్ పాల్గొన్నారు.

బాల్కొండలో డీఎస్‌పీ పాదయాత్ర



బాల్కొండ : బాల్కొండలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గడప గడపకు డీఎస్‌పీలో భాగంగా ఆదివారం పాదయాత్రను జిల్లా అధ్యక్షుడు సుమన్ ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. నాయకులు ప్రేమ్‌మహరాజ్, రాజేశ్వర్, ఉమేష్, మహేష్, సతీష్, నిశాంత్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

వర్ని(చందూర్) : చందూర్‌కు చెందిన 13 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను చందుర్ సహకార సంఘం అధ్యక్షుడు ప్యారం అశోక్ ఆదివారం పంపిణీ చేశారు. యాదవ సంఘం సభ్యులు కృష్ణ ప్రసాద్, బొట్టే సంతోష్, శంకర్, సతీష్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ జర్నలిస్టు కాలనీల్లో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను, మురికి కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. గోసికొండ అశోక్, కమలాకర్, కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో పెట్రోల్ దొంగలు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ హౌసింగ్‌బోర్డు కాలనీ, హుస్నాబాద్ గల్లీలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ల్లో నుంచి పెట్రోల్ దొంగలిస్తున్నారు. కొన్ని రోజులుగా వాహనాల్లో పెట్రోల్ పోతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గోల్‌బంగ్లా ప్రాంతంలో శనివారం రాత్రి దొంగలు ఓ ఇంటి ముందు ఉంచిన ఆటోను దొంగలించేందుకు ప్రయత్నించారు. ఇంటి నుంచి దూరంగా తీసుకువెళ్లి ఆటో స్టార్ట్ చేయడానికి యత్నించారు. అది స్టార్ట్ కాకపోవడంతో అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఆటో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నియామకం



భీమ్‌గల్: బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా తోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడిగా నీలం చిన్న గంగాధర్‌ను నియమించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతల శ్రీనివాస్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యోగేశ్వర సర్సయ్య, సంధ్యరాజు, గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వర్ని: వర్నిలోని మహాత్మ జ్యోతి బాపూలే బాలికల డిగ్రీ కాలేజీలో ప్రవేశం పొందడానికి ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏలో ఎకానమిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, బీజెడ్‌సీలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేకాటస్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని విద్యుత్‌నగర్‌లో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి చేసి నిందితులను అరెస్టు చేశామని వీరి నుంచి రూ.13,400 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

బీజేపీ పండరీపూర్ ఎమ్మెల్యే మహాదేవ్ ఔతాడే



బోధన్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బోధన్‌టౌన్ : రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం రాజ్యమేలుతుందని మహారాష్ట్రలోని పండరీపూర్ ఎమ్మెల్యే సమాధాన్ మహాదేవ్ ఔతాడే అన్నారు. సీఎం కేసీఆర్ హటావో– తెలంగాణకు బచావో అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం బోధన్‌లో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రవాస్ యోజనలో భాగంగా 8 రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించినట్లు చెప్పారు. మహారాష్ట్రకు వచ్చి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసే సీఎం కేసీఆర్ ఇక్కడ శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. దీనికి జవాబు ఎన్నికల్లో ఇస్తామని పేర్కొన్నారు. 14 కోట్ల జనాభా ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వానికి రూ.ఐదు లక్షల కోట్ల అప్పు ఉందని, నాలుగు కోట్ల జనాభా తెలంగాణ అప్పు రూ.ఐదు లక్షల కోట్లు ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. బోధన్ ఎమ్మెల్యే ఇసుక మాఫియా, భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు అడ్లూరి శ్రీనివాస్, శ్యామ్, శ్రీధర్, సుధాకర్‌చారీ, నర్సింహారెడ్డి, మీసిని వినోద్, బాలరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం



బాల్కొండలో మన్‌కీ బాత్ వీక్షిస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే శశికళ, బీజేపీ నాయకులు

బాల్కొండ : కేంద్రం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే జోల్లే శశికళ ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా ఆమె ఆదివారం బాల్కొండలో పర్యటించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ప్రధాన మంత్రి మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని స్థానిక ఎంకే గార్డెన్‌లో వీక్షించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, అంబటి నవీన్ పాల్గొన్నారు.

బీజేపీ విజయం కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి బాపురావు

ఆర్మూర్ టౌన్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం అందరూ కృషి చేయాలని మహారాష్ట్ర వని నియోజకవర్గం ఎమ్మెల్యే సంజీవ్ బాబురావు అన్నారు. ఆర్మూర్‌లోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలియాబాద్ శ్రీనివాస్, పల్లె గంగారెడ్డి, ఉప్పల శివరాజ్, అంకాపూర్ రాకేష్ రెడ్డి, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.


అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు లిస్టులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆర్మూర్‌టౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సూచించారు. ఆయన ఆదివారం ఆర్మూర్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి వచ్చిన వారి వివరాలను తప్పులు లేకుండా ఎంటర్ చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐ అశోక్ సింగ్ పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఆర్డీవో వినోద్ కుమార్ పరిశీలించారు.

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఆదివారం అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పరిశీలించారు. బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింత మల్లారెడ్డి రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న రోడ్డు విషయమై ఆయనకు చెప్పారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఆర్‌ఐ షఫీ ఉన్నారు.



బురదమయంగా రోడ్డు

రుద్రూర్ : రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గైని గుట్ట శ్రీ స్వయంభూ బసవేశ్వర ఆలయానికి వెళ్లె దారి బాగు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ ఆలయానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారు. ప్రధాన రహదారి నుంచి అర కిలోమీటరు రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో భక్తులు అవస్థలు పడుతున్నారు.

వానొస్తే రాకపోకలు బంద్

- జలమయం అవుతున్న లోలెవల్ వంతెన
- ఇబ్బందులు పడుతున్న అమ్రాద్ తండావాసులు

మాక్లూర్ : వర్షాకాలం వస్తే చాలు మండలంలోని అమ్రాద్ తండా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే తండాకు వెళ్లే ప్రధాన రహదారి రైల్వే లో లెవల్ వంతెన నీట మునిగి రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత్యంతరం లేక తండావాసులు కిలోమీటరు పొడువున రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్నారు. గత ఐదేళ్లుగా ప్రతి వానాకాలంలో ఈ సమస్య తలెత్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

నిజామాబాద్ – పెద్దపల్లి రైల్వేలైన్‌లో అమ్రాద్ తండా వద్ద రైల్వే బ్రిడ్జి ఉంది. చిన్నపాటి వర్షానికే సుమారు 30 అడుగుల మేర బ్రిడ్జి కింద నీరు చేరుతోంది. చేరిన నీరు ఖాళీ అయ్యే మార్గం లేక రోజుల తరబడి అలాగే ఉంటుంది. దీంతో తండావాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఒకసారి చేరిన నీరు ఖాళీ కావడానికి 10–15రోజుల సమయం పడుతుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు వెళ్లడానికి చేసిన మార్గం(రంధ్రం) ద్వారా బ్రిడ్జి కింద నీరు ఖాళీ కావడం అటుంచితే.. బయట నీరు బ్రిడ్జి కిందకు చేరుతోంది.

పెద్దసార్లు పట్టించుకోవాలి



వర్షం పడితే మాకు మస్తు బాధ అయితుంది. తండాకు వచ్చే దారిలో రైలు పట్టాలు వేశారు. వాన పడితే వంతెన కింద మనుషులు మునిగిపోయేంత నీళ్లు నిండిపోతాయి. అవి ఖాళీ కావాలంటే మస్తు రోజులు పడుతది. మాకు ఇంకోక్క దారి లేదు. దీంతో అపాయం అని తెలిసిన రైలు పట్టాలపై నడుచుకుంటూ పోయి అమ్రాద్ నుంచి సామన్లు తెచ్చుకుంటాం.పెద్ద సార్లు మా బాధలను తీర్చాలి.

– లింగూబాయి, అమ్రాద్‌తండా



అమ్రాద్ తండాకు వెళ్లే మార్గంలో రైల్వే లోలెవల్ వంతెన

ఆయిల్‌మిల్ వ్యర్థాలతో పంటలకు నష్టం



ఎడపల్లి : ఆయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాలతో చెరువు కలుషితమవుతుందని, పంటలకు నష్టం వాటిల్లుతోందని ఏఐకేఎంఎస్ నాయకులు అన్నారు. మండలంలోని జాన్కంపేట్ శివారులో వరి తౌడుతో తయారు చేసే ఆయిల్ మిల్లు పరిసరా ప్రాంతాలను ఆదివారం వారు పరిశీలించారు. వ్యర్థాలను గ్రామానికి ఆనుకొని ఉన్న వ్యవసాయ భూమిలో డంపు చేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. నాయకులు రాజేశ్వర్, గుమ్ముల గంగాధర్, రవి, మల్లేశ్ పాల్గొన్నారు.

'వర్గీకరణ జోలికొస్తే చంద్రబాబుకు పట్టిన గతే'



బోధన్ : ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలుకుతున్న కాంగ్రెస్‌కు గతంలో చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాలం కాంగ్రెస్, బీజేపీలు తెరపైకి తీసుకొస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ వర్గీకరణకు మద్దతు తెలపడంతో ఆదివారం పట్టణంలో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. నాయకులు నీరడి రవి, శ్రవణ్‌కుమార్, మచ్కురి దేవేందర్, సూర్యకాంత్ వాగ్మారే, స్వామి, సంజీవ్, శ్యాం, రాహుల్ పాల్గొన్నారు.

గైని గుట్టలో అనంత్ మహరాజ్ పుణ్యతిథి



రుద్రూర్ : గైని గుట్ట స్వయంభూ బసవేశ్వర ఆలయం దివంగత అర్చకులు అనంత్ మహరాజ్ పుణ్యతిథిని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేశారు. మల్లికార్జున శివాచార్య మహరాజ్ కార్యక్రమానికి హాజరై భక్తులు ప్రవచనం చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

సమాచారం..

నేడు ఎత్తొండకు స్పీకర్

రుద్రూర్ : కోటగిరి మండలం ఎత్తొండకు సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వస్తున్నట్లు జెడ్పీటీసీ శంకర్ పటేల్ తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారన్నారు.

కమ్మర్‌పల్లికి మంత్రులు

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలానికి సోమవారం మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత రానున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దేవేందర్ ప్రకటనలో తెలిపారు. కమ్మర్‌పల్లి, నాగాపూర్, చౌట్‌పల్లిలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని వెల్లడించారు.

విఠలేశ్వర మందిరంలో పూజలు

రుద్రూర్: రుద్రూర్‌లోని శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస ద్వాదశి పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిదుర వీరేశం, గెంటిల సాయిలు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. గైని గుట్ట బ సవేశ్వరాలయం, రుద్రూర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా అ న్నదానం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ముప్కాల్‌లో శంకుస్థాపన చేస్తున్న మంత్రి

బాల్కొండ : ముప్కాల్, మండలంలోని కొత్తపల్లిలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ముప్కాల్ నుంచి దూల గుట్ట మల్లన్న గుడి వరకు రోడ్డు విస్తరణ పనులకు, ముప్కాల్ నుంచి కొత్తపల్లి మీదుగా డబుల్ రోడ్డు పనులకు, మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, సీసీ డ్రెయినేజీ పనులకు, కొత్తపల్లిలో హెల్త్ సబ్‌సెంటర్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే ముప్కాల్ రూపరేఖలను మారుస్తామని తెలిపారు. ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కో ఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, ఎంపీటీసీ పద్మ పాల్గొన్నారు.

జోరుగా మొరం దందా!



మొరం తరలిస్తున్న టిప్పర్లు

- రాణాకలాన్ శివారులో తవ్వకాలు
- ఓ ప్రజాప్రతినిధి హస్తంతో కొనసాగింపు

ఎడపల్లి : మండలంలోని రాణాకలాన్ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గ్రామంలోని బొక్కల ఫ్యాక్టరీ దగ్గరలో ప్రభుత్వ భూమిలో వారం రోజుల నుంచి మొరం తవ్వకాలు చేపడుతున్నారు. విద్యుత్ శాఖకు ఐదు టిప్పర్లకు అనుమతి తీసుకొని వారం రోజులుగా తవ్వకాలు చేపడుతున్నారు. ఈ మొరం దందా వెనుక ఓ ప్రజాప్రతినిధి హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ మోతీ సింగ్‌ను వివరణ కోరగా సబ్ స్టేషన్ రోడ్డు కోసం ఐదు టిప్పర్లకు అనుమతి ఇచ్చామన్నారు. అక్రమంగా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అభివృద్ధి ముసుగులో దోచుకున్నారు



కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ : బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి ముసుగులో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆయన అనుచరలు దోచుకున్నారని కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ముప్కాల్, కొత్తపల్లిలో ఇంటింటికి కాంగ్రెస్–గుండె గుండెకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లను పరిశీలించారు. రోడ్లు వేసిన వారం రోజులకే కొట్టుకుపోయయని స్థానికులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చెక్ డ్యాంల పేరిట మంత్రి దోచుకుంటే, గ్రామాల్లో సీసీ రోడ్లలో మంత్రి అనుచరులు దోచుకున్నారన్నారు. అనంతరం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, విజయ్, సుభాష్, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బాల్కొండ : బాల్కొండకు చెందిన పటేల్స్ యూత్ సభ్యులు ఆదివారం ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

భీమ్‌గల్ : మండలంలోని ముచ్కూర్, సుదర్శన్ నగర్ తండాలకు చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ముత్యాల సునీల్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొదిరె స్వామి, జేజే నర్సయ్య పాల్గొన్నారు.

రైతుసంక్షేమం కోసం పరితపించిన నాయకుడు సురేందర్‌రెడ్డి



సురేందర్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న మంత్రి



ఆర్‌ఆర్ నగర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

వేల్పూర్ : తన ఆఖరి శ్వాస వరకు రైతాంగ సంక్షేమం కోసం పరితపించిన రైతు నాయకుడు స్వర్గీయ వేముల సురేందర్‌రెడ్డి అని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం వేల్పూర్‌లో బీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వేముల సురేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేందర్‌రెడ్డి ఆది నుంచి కేసీఆర్ వెన్నంటే ఉండి రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా పని చేశారన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో తన తండ్రి ఆశయాలు కొనసాగిస్తానని మంత్రి తెలిపారు.

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి, రాజరాజేశ్వరీ నగర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తండ్రి స్వర్గీయ వేముల సురేందర్‌రెడ్డి వర్ధంతిని బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహించారు. సురేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొనసాగుతున్న నిజాం షుగర్స్ కార్మికుల దీక్ష



బోధన్ : ఎన్డీఎస్ఎల్ లే ఆఫ్ కాలం నుంచి రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికులు షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన గేటుకు ఎదురుగా చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి 23వ దీక్షలు రోజుకు చేరాయి. దీక్షలో కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు, మంగీయ కూర్చున్నారు. కార్మికులు రమేష్, గాలయ్య, శ్రీనివాస్, బాలకృష్ణ, అన్వర్‌మియా, అబ్దుల్ బషీర్, వికారోద్దీన్, ఇసాక్ పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – కోక్ (తెలుగు) – 11.00, 2.35, 6.10, 9.45
- స్క్రీన్-2 – గాండీవధారి అర్జున – 10.00, 1.00, 4.00, 7.00, 10.00
- స్క్రీన్-3 – జైలర్ (తెలుగు) – 11.35, 3.00, 6.25, 9.50
- స్క్రీన్-4 – బెదురులంక-2012(తెలుగు)- 12.35 6.50 10.00
  బాయ్స్ హస్టల్(తెలుగు)-3.45

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం.మధుసూధన్ (ACO) : 9951027699
రాంచాథ్ (నిజామాబాద్ అర్బన్ & రూరల్) : 7997958181
ఎ.శివ (ఆర్మూర్) : 9848956776
పి.కళ్యాణ్ (బోధన్) : 83281 91021
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899